కోలాహలంగా తమిళ ఉగాది వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


విశేషాలంకరణలో పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి


స్వామివారి దర్శనానికి బారులు దీరిన భక్తులు


స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఏజే శేఖర్, సభ్యులు

అడయార్, ఏప్రిల్ 14: తమిళ కొత్త సంవత్సరాది క్రోధి నామసం వత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వేడుక లకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. తమిళ ఉగాదిని ఆహ్వా నిస్తూ టి.నగర్, వెంకటనారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ ఆల యాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. శ్రీదేవి భూదేవి సమిత స్వామి వారికి పట్టుపీతాంబరాలు, స్వర్ణ ఆభరణాలతో ఆలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులను క్యూలో స్వామి దర్శనానికి అనుమతించారు. చెన్నై టీటీడీ సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ నేతృత్వంలో సభ్యులు, అధికారులు భక్తులు సాఫీగా దర్శనం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఆలయం తరపున భక్తులందరికీ లడ్డూ ప్రసాదాన్ని వితరణ చేశారు. అలాగే, వడపళని మురుగన్ ఆలయం, ట్రిప్లికేణి పార్థసారథి ఆలయం, మైలాపూర్ కపాలీశ్వర ఆలయం, షావుకారుపేటలోని ఏకాంబరేశ్వరాలయం, చెన్న కేశవాలయం, కాళికాంబాళ్ ఆలయం, రంగనాథ స్వామి ఆలయం, మైలాపూరులోని షిర్డి సాయిబాబా ఆలయం తదితర ఆలయాల్లో నూతన సంవత్సరాది సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు , పూజలు నిర్వహించారు. తిరువళ్ళూరు జిల్లా తిరుత్తణి, తిరుచ్చెందూరు సుబ్రమణ్యస్వామి ఆలయాలు, మదురై మీనాక్షి అమ్మవారి ఆలయం, తిరునెల్వేలి నిష్ట వినాయక స్వామి ఆలయం, తంజావూరు బృహదీశ్వర ఆలయాల్లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాలొన్నారు.. క్రోధి నామసంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయాల్లో మూలవర్లకు సుప్రభాత సేవ ప్రత్యేక అభిషేకాలు, మహాదీపారాధన చేశారు.

ఈవీఎంల వద్ద భారీ భద్రత

ప్యారీస్, ఏప్రిల్ 14: ఈ నెల 19న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనున్న సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఏవీఎంల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల అధికారులకు శిక్షణ రాష్ట్ర ఎన్నికల సంఘం వేగవంతం చేసింది. రాజధాని నగరం చెన్నైలో 16 నియోజకవర్గాలను కలుపుకొని దక్షిణ చెన్నై, సెంట్రల్ చెన్నై, ఉత్తర చెన్నై మూడు పార్లమెంటు నియోజకవర్గాలున్నాయి. వీటిలో ఉత్తర చెన్నైలో తిరువళ్లూర్ జిల్లాలో ఉన్న తిరువొత్తియూర్ అసెంబ్లీ స్థానం, దక్షిణ చెన్నైలో చెంగల్పట్టు జిల్లాలోని షోలింగనల్లూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు అదనంగా విలీనమయ్యాయి. వీటితో కలిపి మొత్తం 18 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 48,35,672 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 4,680 పోలింగ్ కేంద్రాల్లో 14,891 ఈవీఎంలు వినియోగించనున్నారు. ఉత్తరు చెన్నైకు క్వీన్ మేరీస్ కళాశాలలో, సెంట్రల్ చెన్నైకు లయోలా కళాశాలలో, దక్షిణ చెన్నైకు అన్నా యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలు, వీవీప్యాడ్‌లు భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు జరిగే కళాశాలల్లో కౌంటింగ్ నిమిత్తం గదులు సిద్ధం చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈ మూడు కళాశాలల్లో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు తరలించి మొత్తం 46 రోజులు భద్రపరుస్తారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ ముగిసే రోజు సాయంత్రం సీలు వేసే స్ట్రాంగ్ రూమ్‌లను మళ్లీ జూన్ 4వ తేదీ కౌంటింగ్ సందర్భంగా తెరుస్తారు. అప్పటివరకు స్ట్రాంగ్ రూమ్‌ల ఛాయలకు ఎవ్వరూ వెళ్లకుండా సాయుధ బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటుచేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



తమిళుల చెవుల్లో పూలు

- బీజేపీ మేనిఫెస్టోపై సీఎం స్టాలిన్



చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి రూ.10.76లక్షల కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడం తప్పుడు లెక్కలకు నిలువెత్తు సాక్ష్యమని, తమిళ ప్రజల చెవుల్లో పూలు పెట్టడమే అవుతుందని, డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేస్తూ గత పదేళ్లలో రాష్ట్రానికి రూ.10.76 లక్షల కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడం పచ్చి అబద్ధమన్నారు. ఈ తప్పుడు సమాచారం వెనుక దాగిన మూడు అంశాలను పరిశీలించాల్సి ఉందని, ఆ ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి నేరుగా అందించే నిధులు, కేంద్ర ఆర్థిక సంఘం ప్రతిపాదన మేరకు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించాల్సిన నిధులు, పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేయాల్సిన నిధులు ఇలా మూడు రకాలున్నాయన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి రూ.18.5లక్షల కోట్ల మేరకు నిధులను ఉదారంగా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.5.5లక్షల కోట్ల మేరకే నిధులు విడుదల చేసి తన సవతి తల్లి ప్రేమ చాటుకుందని విమర్శించారు. ఇక మదురై ఎయిమ్స్ ఆస్పత్రి ప్రహరీ నిర్మాణం కూడా జరుగని స్థితిలో ఆ ఆస్పత్రి కోసం రూ.1960 కోట్ల మేరకు విడుదల చేసినట్టు కూడా బీజేపీ తప్పుడు లెక్కలలో ఉన్నాయని, ఇది రాష్ట్రాభివృద్ధి కోసం కేటాయించినా నిధులా? అని ప్రశ్నించారు. రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టుకు నిధులివ్వమంటూ తాను ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు రూ.63,246 కోట్లు, సాగరమాల ప్రాజెక్టుకు రూ.2లక్షల కోట్లు విడుదల చేసినట్లు చెప్పడం తమిళ ప్రజలందరినీ మోసపుచ్చి వారి చెవుల్లో కేంద్రం పెట్టిన పూవులేనని స్టాలిన్ ఎద్దేవా చేశారు. దమ్ముంటే గత పదేళ్లలో రాష్ట్రానికి సంబంధించి ఏయే పథకాలకు ఎంతమేరకు నిధులు కేటాయించి విడుదల చేశారని ప్రధాని మోదీగానీ, మంత్రులుగానీ సమగ్రమైన వివరాలను వెల్లడించగలరా? అని ప్రశ్నించారు. వీటన్నింటికంటే మరో నమ్మలేని నిజం కూడా ఉందని, అదేమిటంటే ఎంఎస్ఎంఈలు బ్యాంకులకు తిరిగి చెల్లించాల్సిన రూ.2.5 లక్షల కోట్ల రుణాలకు కేంద్రమే నిధులిచ్చినట్లు పేర్కొనడమేనని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో రాష్ట్రానికి భారీగా నిధులు విడుదల చేసినట్లు అసత్యాలతో తమిళ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నించడం సబబేనా అని స్టాలిన్ ప్రశ్నించారు. కేంద్రం ఇలా అదే పనిగా చెబుతున్న వరుస అబద్ధాలను వింటుంటే తమిళుల చెవులకు పాపం అంటుకుంటుంది కదా అని స్టాలిన్ యెద్దేవా చేశారు.

తారస్థాయికి చేరిన ఎన్నికల ప్రచారం

- మరో మూడురోజులే అవకాశం
- ఎండను కూడా లెక్క చేయని నేతలు



అడయార్, ఏప్రిల్ 14: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచార గడువు మరో మూడు రోజుల్లో ముగియనుండటంతో పార్టీ నేతల ప్రచారం తారస్థాయికి చేరింది. ఇప్పటివరకూ ఉదయం, సాయంత్రం ప్రచారం చేసిన పార్టీల నాయకులు, అభ్యర్థులు ఆదివారం నుంచి మూడుపూటలా ప్రచారం చేయడానికి సిద్ధమయ్యారు. డీఎంకే, అన్నాడీఎంకే సహా అన్ని పార్టీల నేతలు, అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలతో పాటు పుదుచ్చేరిలోని ఒక లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న తొలి దశ పోలింగ్ జరుగనుంది. ఎన్నికల ప్రచారం ఈ నెల 17 సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. దీంతో అధికార డీఎంకే, విపక్ష అన్నాడీఎంకే, బీజేపీతో పాటు ఇతర పార్టీల తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. అయినప్పటికీ ఏమాత్రం లెక్క చేయకుండా అభ్యర్థులు తమ విజయం కోసం తీవ్ర స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. అన్ని పార్టీ అగ్రనేతలు ప్రచారం చేస్తున్నారు కాగా, ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు దఫాలుగా రాష్ట్రంలో పర్యటించి, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, వామపక్ష పార్టీల అగ్రనేతలతో పాటు ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, డీపీఐ ప్రధాన కార్యదర్శి తొల్‌తిరుమావళవన్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీఎండీకే అధ్యక్షురాలు ప్రేమలత, పీఎంకే అగ్రనేతలు డాక్టర్ రాందాస్, అన్బుమణి , టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అధ్యక్షుడు టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం ఇలా అన్ని పార్టీల నేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

వైద్య విద్యార్థిపై కాల్పుల యత్నం

- ఇద్దరు ఉత్తరాది యువకుల అరెస్టు


అరెస్టయిన అమిత్‌కుమార్, స్వాధీనం చేసుకున్న తుపాకీ

ప్యారీస్, ఏప్రిల్ 14: రాజధాని నగరంలో వైద్యవిద్యార్థిని తుపాకీతో కాల్చి చంపేందుకు ప్రయత్నించిన ఉత్తరాది యువకులు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు... వేలూరు జిల్లాకు చెందిన రోగన్ మద్రాసు వైద్య కళాశాలలో పీహెచ్‌డీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 25 ఏళ్ల విద్యార్థినితో రోగన్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. ఆ ప్రేమ జంట తీసుకున్న ఫొటో, వీడియోలను ఆ యువతి సోషల్ మీడియాలో విడుదల చేయగా, వాటిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమిత్‌కుమార్ అనే యువకుడు చూసి దిగ్ర్భాంతికి గురయ్యాడు. ఆ యువకుడు విద్యార్థినికి మాజీ ప్రియుడని తెలిసింది. ఈ నేపథ్యంలో, తన ప్రేయసిని మరో వ్యక్తి ప్రేమించడం జీర్ణించుకోలేని అతడు రోగన్‌ను మట్టుబెట్టాలని పథకం రూపొందించాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో విద్యార్థి రితీష్‌కుమార్ కలిసి రోగన్‌కు ఫోన్‌లో బెదిరించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న వాల్‌టాక్స్ రోడ్డులోని దుకాణంలో టీ తాగేందుకు రోగన్ రావడాన్ని రితీష్‌కుమార్ బృందం గమనించి వెంటనే నాటు తుపాకీతో రోగన్‌పై కాల్పులు జరిపేందుకు యత్నించి విఫలమయ్యారు. వారు తప్పించుకొనే ప్రయత్నంలో స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో జనసంచారం అధికంగా ఉన్న చోట జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది.

నేటినుంచి చేపలవేట బంద్

- 61 రోజుల పాటు నిషేధ కాలం

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం అర్ధరాత్రి నుండి చేపల వేట నిషేధం అమలులోకి వచ్చింది. ప్రతియేటా ఏప్రిల్ 15 నుంచి రెండు నెలల వరకూ చేపల సంతానోత్పత్తి కాలంగా పరిగణించి జాలర్లు మోటరు పడవల్లో చేపలవేటకు వెళ్లడంపై నిషేధం అమలు చేస్తున్న విషయం విదితమే. ఈ రెండు నెలలూ నాటు పడవల్లో అదీ ఒకటి రెండు నాటికల్ మైళ్ల దూరం వరకే వెళ్లి జాలర్లు చేపలు పడతారు. దీంతో రెండు మాసాలపాటు రాష్ట్ర ప్రజలు చెరువు చేపలపై దృష్టిసారిస్తారు. చేపల వేట నిషేధ కాలం అమలులోకి రావటంతో సముద్రంలో చేపలు పట్టే మరపడవల జాలర్లంతా తీరానికి తిరిగి వస్తున్నారని మత్స్య శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. చిన్న నాటు పడవలు, ఫైబర్ పడవలను మాత్రమే చేపలవేటకు అనుమతిస్తామన్నారు. ఇక కాశిమేడు, చింతాద్రిపేట, ఐస్‌హౌస్ చేపల మార్కెట్లలో సాధారణ రకం చేపలు మాత్రమే విక్రయించనున్నారని వివరించారు. ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైన చేపల వేట నిషేధం కాలం 61 రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు.


నాటుపడవల్లో చేపలు పడుతున్న జాలర్లు

నేడు రాష్ట్రానికి ప్రధాని మోదీ రాక

బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



ప్యారీస్, ఏప్రిల్ 14: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం ముగియడానికి ఇక మూడు రోజులే మిగిలి ఉండడంతో ప్రాంతీయ పార్టీల నేతలు, జాతీయ పార్టీల నేతలు పోటీపడి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎన్డీఏ కూటమికి మద్దతుగా ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ఏడు సార్లు రాష్ట్రంలో పర్యటించిన నేపథ్యంలో, సోమవారం 8వ సారి మళ్లీ బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొననున్నారు. ప్రధాని దక్షిణ జిల్లా బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్న సందర్భంగా తిరునల్వేలి జిల్లాలో భద్రత పటిష్టం చేశారు. జిల్లా ఎస్పీ సిలంబరసన్ అంబాసముద్రం సమీపంలోని అగస్తియర్‌పట్టిలో ఉన్న ప్రైవేటు మైదానంలో వేదికను ఆదివారం ఉన్నతాధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం జిల్లా సరిహద్దుల్లో వాహనతనిఖీలు ముమ్మరం చేయాల్సిందిగా ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా లాడ్జీలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కుల వద్ద పొందుపరిచిన సీసీ కెమెరాలను పర్యవేక్షించి బందోబస్తులో పాల్గొనవలసిందిగా ఉత్తర్వులు జారీచేశారు. ప్రధాని మోదీ పాల్గొనే ప్రచార సభలకు వెళ్లే కార్యకర్తలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని సోమ, మంగళవారాల్లో అంబాసముద్రంలో సుమారు 5 కి.మీ వరకు భద్రతా వలయంలోకి తీసుకొచ్చారు. ప్రధాని మోదీ వచ్చి వెళ్లే వరకు తిరునల్వేలి జిల్లా వ్యాప్తంగా డ్రోన్లు ఎగురవేసేందుకు నిషేధం విధించారు.


అన్నామలైపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తమిళాభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి సుబ్రమణియన్, పౌరసంబంధాల శాఖ సంచాలకులు డాక్టర్ కీరవైద్యనాథన్ తదితరులు


సేలం కార్పొరేషన్ పార్క్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, పార్టీ శ్రేణులు


రాజ్‌భవన్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

అంబేడ్కర్‌కు నేతల ఘననివాళి

ప్యారీస్, ఏప్రిల్ 14: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత సహా వివిధ పార్టీల నేతలు ఆ మహనీయుడి విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ స్థానిక రాజా అన్నామలైపురంలో ఉన్న మణిమండపంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం తేనాంపేటలో ఉన్న డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయానికి వెళ్లి నివాళులర్పించారు. సీఎంతో పాటు మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఎంపీ దయానిధి మారన్, ఎమ్మెల్యేలు ఎ.కరుణానిధి, ఎళిలన్ తదితరులున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్.రవి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సేలంలో...

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సేలం కార్పొరేషన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్థానిక కోడంబాక్కం పవర్ హౌస్ జంక్షన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు పొన్నయ్యన్, జయకుమార్, బెంజిమెన్, టీకేఎం చిన్నయ్య తదితరులు నివాళులర్పించారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై, ఎంపీ తిరునావుక్కరసు, ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ తదితరులతో కలసి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అన్నానగర్ టీపీ సత్రంలో సీపీఎం తరఫున మాజీ ఎంపీ టీకే రంగరాజన్, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, నటుడు విజయ్ ఈసీఆర్ రోడ్డులో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, ఎండీఎంకే అధ్యక్షుడు వైగో, టీఎంసీ అధ్యక్షు డు జీకే వాసన్ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

సమాచార ధ్వని

నేడు రాష్ట్రానికి రాజ్‌నాథ్ సింగ్

పెరంబూర్, ఏప్రిల్ 14: రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం రానున్నారు. గత వారం రెండు రోజులు పర్యటించిన కేంద్ర మంత్రి, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 16న రాష్ట్రానికి రానున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఈరోడ్, పొల్లాచ్చి, కృష్ణగిరి నియోజకవర్గాల్లో బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటారని పార్టీ నేతలు తెలిపారు.

ముగిసిన ప్లస్ టూ మూల్యాంకనం

పెరంబూర్, ఏప్రిల్ 14: రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ వన్, ప్లస్ టూ జవాబు పత్రాల మూల్యాంకనం ముగిసింది. ప్లస్ టూ పరీక్షలు మార్చి 1 నుంచి 22వ తేది వరకు జరిగాయి.. ఈ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం రాష్ట్రవ్యాప్తంగా 83 కేంద్రాల్లో ఈనెల 1న ప్రారంభమై శనివారంతో ముగిశాయి. 40 వేల మంది పీజీ ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొన్నారు. సోమవారం నుంచి మార్కుల గణన, మార్కుల అప్‌లోడ్ తదితర పనులు పూర్తిచేసి, మే 6వ తేది ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది.

పెరంబూర్ మీదుగా పురూలియా-విల్లుపురం రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 14: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పురూలియా-విల్లుపురం ప్రత్యేక రైళ్లు చెన్నై పెరంబూర్ మీదుగా వెళ్లనున్నాయి. అలాగే, విల్లుపురం బదులుగా తిరునల్వేలి వరకు ఈ రైళ్లు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. పురూలియా-విల్లుపురం మధ్య సోమ, శుక్రవారాల్లో నడిచే వారాంతపు రైళ్లు భువనేశ్వర్, విశాఖపట్టణం, విజయవాడ, రేణిగుంట, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం మీదుగా వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ రైళ్లు చెన్నై, పెరంబూర్, అరక్కోణం మీదుగా వెళ్లనున్నాయని దక్షిణ రైల్వే తెలియజేసింది.

తాంబరం-మంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 14: వేసవి రద్దీని దృష్ట్యా తాంబరం-మంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06049 తాంబరం-మంగళూరు ప్రత్యేకరైలు ఈనెల 19,26, మే 4,10,17, 24,31 (శుక్రవారం) తేదీల్లో తాంబరం నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు మంగళూరు చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06050 మంగళూరు-తాంబరం ప్రత్యేక రైలు ఈ నెల 21,28, మే 5,12,19,26, జూన్ 2 (ఆదివారం) తేదీల్లో మంగళూరు నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్లు చెన్నై ఎగ్మూర్, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోయంబత్తూర్, పాలక్కాడ్, ఊత్తపాళయం, సోరానూర్, తిరూర్, కోళికోడ్, వడకర, తలచ్చేరి, కన్నూర్, పయ్యానూర్, కాసర్‌ఘడ్ తదితర స్టేషన్లలో ఆగనున్నాయి.

ఐదురోజులు పెరగనున్న ఉష్ణోగ్రతలు

పెరంబూర్, ఏప్రిల్ 14: రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2నుంచి 3 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. ఈ మేరకు కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ జిల్లాల్లో రానున్న 48 గంటల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా రాబోయే ఐదు రోజుల్లో పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలకు చేరుకొనే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం కొంత సమయం మేఘావృతంగా ఉంటూ అత్యధిక ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

నేడు పోలీసుల ప్రత్యేక పోలింగ్ శిబిరాలు

పెరంబూర్, ఏప్రిల్ 14: నగరంలో ఎన్నికల విధులు చేపడుతున్న పోలీసులు తపాలా ఓటు హక్కు వినియోగించుకొనేలా సోమవారం ప్రత్యేక ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ తెలియజేసింది. చెన్నై జిల్లా పరిధిలోని ఉత్తర, దక్షిణ, మధ్య చెన్నై లోక్‌సభ నియోజక వర్గాలకు సంబంధించిన ఎన్నికల్లో డ్యూటీ చేసేందుకు పలు జిల్లాల నుంచి సుమారు 19వేల మంది పోలీసులను నియమించారు.వారు తపాలా ఓటు వినియోగించుకొనేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, శుక్రవారం నుంచి మూడు రోజులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, 16 శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని శిక్షణా కేంద్రాల్లో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలీసులు తపాలా ఓటు వేసేలా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ తెలిపింది.

ఫైనాన్సియర్ ఇంట్లో రూ.1.5 కోట్లు స్వాధీనం

ప్యారీస్, ఏప్రిల్ 14: జిల్లా కేంద్రం నామక్కల్ ఈపీ కాలనీలో నివసిస్తున్న చెల్లప్పన్ (60) అనే ఫైనాన్సియర్ ఇంట్లో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆకస్మికతనిఖీలు చేసి రూ.1.5 కోట్ల నగదు, రూ.30 కోట్ల విలువ చేసే ఆస్తులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నామక్కల్ జిల్లావ్యాప్తంగా వాహనతనిఖీల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో, ఓటర్లకు పంపిణీ చేసే నిమిత్తం కరెన్సీ నోట్లను ఫైనాన్సియర్ చెల్లప్పన్ ఇంట్లో భద్రపరిచారని సమాచారం అందింది. దీంతో శనివారం అక్కడకు చేరుకున్న పోలీసులు, నాలుగు సంచుల్లో ఉన్న రూ.500 నోట్లు సుమారు రూ.15 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చెల్లప్పన్‌కు సంబంధించిన రూ.30 కోట్లు విలువైన ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల వేళ కావడంతో నగదు, పత్రాలను ట్రెజరీలో అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

వాణియంబాడి సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్

● కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే రైళ్లు ఆలస్యం



కుప్పం, ఏప్రిల్ 14: తమిళనాడు రాష్ట్రం వాణియంబాడి సమీపంలో గూడ్స్ రైలు ఆదివారం రాత్రి పట్టా లు తప్పింది. దీంత కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే పలు రైళ్లు ఆలస్యమయ్యాయి. తిరుపతినుంచి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ వాణియంబాడిలో ఆగిపోయింది. అలాగే చెన్నై నుంచి కుప్పం మీదుగా బెంగళూరు వెళ్లే లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్‌ను వలతూర్ రైల్వే స్టేషన్‌లో అధికారులు ఆపేశారు. దీంతో కుప్పం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు రాత్రి వేళ తీవ్ర అవస్థలు పడ్డారు. కాగా రైల్వే అధికారులు వాణియంబాడి వద్ద పట్టాలు తప్పిన రైలుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘననివాళి





హార్బర్‌లో రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పిస్తున్న తెలుగు ప్రముఖులు కన్నెమరకల కుమార్, కర్రా లోకేష్‌కుమార్ తదితరులు - అన్నామలైపురంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న డా.కొల్లి రాజు బృందం

ప్యారీస్, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా నగరంలోని తెలుగు సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెన్నై కలెక్టర్ కార్యాలయం సమీపంలో, పెరియమెట్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, రాజా అన్నామలైపురంలోని అంబేడ్కర్ మణిమండపంలో నివాళులర్పించారు.

కొడుంగైయూర్‌లో... : కొడుంగైయూర్ చిన్నాండి మఠంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, మద్రాసు యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు తదితరులు నివాళులర్పించారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద... : కలెక్టర్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కర్రా లోకేష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, పుల్లాపురం ఆది ఆంధ్ర సేవా సంఘం కార్యదర్శి కన్నెమరకల కుమార్, అధ్యక్షుడు ఇరకట్ల నాగభూషణం, కోశాధికారి గొల్లపల్లి గోపి తదితరులు నివాళులర్పించారు.

ఆర్‌ఏ పురంలో...

మద్రాసు ఆదిఆంధ్ర అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు ఘననివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు, ప్రముఖ శాస్త్రవేత్త డా.కొల్లి రాజు నేతృత్వంలో నిర్వాహకులు పాల్గొన్నారు. వీరితో పాటు పలు ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



కొడుంగైయూర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఆచార్య విస్తాలి శంకరరావు, గుడిమెట్ల చెన్నయ్య

చెన్నై తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో

17న సీతారామ కల్యాణం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న సీటీఏ అధ్యక్షుడు కేఆర్కే బాలాజీరావు, సంస్థ నిర్వాహకులు

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కంలోని చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 17న సీతారామకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కేఆర్కే బాలాజీరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరానికి చెందిన తెలుగు ప్రముఖులు, దాతల సహాయ సహకారాలతో గత 17 సంవత్సరాలుగా సీతారామకల్యాణమహోత్సవాలను క్రమతప్పకుండా నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నామని, ఈ యేడాది కూడా భద్రాచల క్షేత్రంలో నిర్వహించే విధంగానే మధురవాయల్ ఏరికరై ప్రాంతానికి సమీపంలో ఉన్న సీతాలక్ష్మి కల్యాణ మండపంలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కల్యాణానికి ముందుగా ఉదయం 7.30 గంటలకు సంస్థ కార్యాలయం నుంచి కల్యాణ మండపం వరకు ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరుగుతుందని, ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు వేద పండితులు కుమారగురు, కామకోటి, వేదపాఠశాల విద్యార్థులు కలిసి వేదపారాయణం చేస్తారని తెలిపారు. ఆ తర్వాత సీతారాముల నిర్వహిస్తామని, ఆ వేడుకల్లో సంస్థకు చెందిన ఎనిమిది మంది సతీసమేతంగా పాల్గొంటారని చెప్పారు. ఈ వేడుకలకు సుమారు 400 మందికి పైగా భక్తులు రానున్నారని, స్వామివారి కల్యాణోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కల్యాణోత్సవం అనంతరం ఆంధ్రా వంటలతో భోజనం కూడా కల్పిస్తున్నామని ఆయన వివరించారు. ఈ కల్యాణోత్సవానికి అందరూ ఆహ్వానితులేనని, వేడుకల్లో పాల్గొని సీతారాముల అనుగ్రహం పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఆశోక్ కిషన్, కార్యదర్శి వైఎస్వీ సుబ్బారావు, సంయుక్త కార్యదర్శులు టీవీఎల్ నరసింహారావు, వెంకటేశ్వర్లు, నాగరాజ్ కమిటీ సభ్యులు ప్రసాద్, మధుకర్, శ్రీహరిరావు, శ్రీనివాస్, నాగేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయంలో తమిళ ఉగాది వేడుకలు



ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన ఆనంద షిర్డీ సాయి

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని అరుళ్‌మిగు నందనవన ఆనంద షిర్డీ సాయి ఆలయం, అరుళ్‌మిగు ఆనందనాయకి సమేత ఆనందీశన్ ఆలయంలో తమిళ సంవత్సరాది వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా షిర్డీ సాయి విగ్రహానికి అభిషేకం పూజలు నిర్వహించి పుష్పాలతో మామిడిముక్కలతో అలంకరించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం చేశారు.

పళని ఆలయానికి పోటెత్తిన భక్తులు



పళని పర్వతాలయం వద్ద గుమికూడిన భక్తులు

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయ క్షేత్రమైన పళని పర్వతాలయంలో తమిళ ఉగాది సందర్భంగా ఆ స్వామివారిని దర్శించేందుకు వేలాది మంది భక్తులు తరలి వెళ్ళారు. శ్రీకోధి నామ సంవత్సరం సందర్భంగా ఆలయంలో 4.30 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి స్వర్ణాభిషేకం చేసి రాజఅలంకారంతో కొలువుదీర్చారు. ఆ తర్వాత వేదపండితులు పంచాంగ పఠనం చేశారు. స్వామివారికి, అమ్మవారికి, పరివార దేవతలకు కూడా అలంకారం చేశారు. వివిధ జిల్లాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలిరావటంతో పర్వతం దిగువ, రోప్‌కార్ సెంటర్లు, పర్వతాలయం వద్ద రద్దీ అధికమైంది. క్యూలైన్లలో భక్తులు స్వామివారిని దర్శించేందుకు రెండు గంటలు పట్టింది. భక్తులందరికీ స్వామివారి వద్ద పూజించిన నాణేలను కానుకగా అందజేశారు. ఆదివారం సాయంత్రం వరకూ ఆలయం వద్ద భక్తులు రద్దీ ఏమాత్రం తగ్గలేదు. ఆలయ దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఆలయ అధికారులు, పోలీసులు తగు ఏర్పాట్లు చేపట్టారు.

మేల్‌మరువత్తూర్‌లో ఉగాది వేడుకలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న లక్ష్మీ బంగారు అడిగళార్

ప్యారీస్, ఏప్రిల్ 14: చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్‌లోని ఆదిపరాశక్తి ఆలయంలో క్రోధి నామ సంవత్సర తమిళ ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆధ్యాత్మిక వి భాగం అధ్యక్షురాలు లక్ష్మీ బంగారు అడిగళార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కలశ పూజలను శ్రీదేవి ప్రారంభించారు. ఇందులో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆదిపరాశక్తి అమ్మవారికి 11 రకాల అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు.

ఎయిమ్స్ భవన నిర్మాణ పనులు ప్రారంభం



పెరంబూర్, ఏప్రిల్ 14: మదురై తోప్పూరులో మదురై ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత నెలలో పనులు ఏ మేరకు జరిగాయనే విషయం మదురై ఎయిమ్స్ నిర్వాహకులు 'ఎక్స్'లో ఫొటోలు విడుదల చేశారు. మదురై తోప్పూరులో ఎయిమ్స్ ఆస్పత్రి ఏర్పాటుచేయనున్నట్లు 2018లో ప్రకటించగా, 2019 జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. గత నెల 4వ తేది మదురై ఎయిమ్స్ ఆస్పత్రి టెండర్ దక్కించుకున్న ఎల్ అండ్ టీ పనులు ప్రారంభించింది. తొలుత ఆసుపత్రి భవనం ఏర్పాటుకానున్న ప్రాంతాన్ని చదును చేసి వాస్తు పూజలు నిర్వహించారు. కొన్ని పనులకు వారం రోజుల్లో భూమి పూజ చేపట్టనున్నారని, అనంతరం నిర్మాణపనులు వేగవంతం చేసి 33 నెలల్లో పూర్తిచేయనున్నట్లు ప్రకటించారు.. 950 పడకలు, పది అంతస్తులతో మదురై ఎయిమ్స్ ఆసుపత్రి రూపుదిద్దుకోనుంది.

అన్నాడీఎంకే అభ్యర్థిపై కేసు

పెరంబూర్, ఏప్రిల్ 14: సేలం జిల్లా ఆత్తూరు కోట ప్రాంతంలో ఉన్న ఓ కల్యాణ మండపంలో మార్చి 16వ తేది కళ్లకుర్చి లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి పరిచయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అభ్యర్థి కుమరగురు, ఓటర్లకు నగదు అందించే విషయం మాట్లాడారని సమాచారం. ఈ విషయమై వీఏవో గోపినాథ్ ఆత్తూర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమావేశం దృశ్యాలను కోర్టులో సమర్పించిన పోలీసులు, కోర్టు అనుమతితో అన్నాడీఎంకే అభ్యర్థి కుమరగురుపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

జనావాసాల్లోకి ఏనుగుల మంద



రోడ్డు దాటుతున్న ఏనుగుల మంద

పెరంబూర్, ఏప్రిల్ 14: కోయంబత్తూర్ జిల్లా తొండాముత్తూర్ సమీపంలో ఏనుగుల మంద గ్రామంలోకి ప్రవేశించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. జిల్లాలోని పశ్చిమ కనుమల కొండల ప్రాంతాల సమీపంలోని తొండాముత్తూర్, చుట్టుపక్కల గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తొండాముత్తూర్-నరసిపురం రోడ్డును గున్న ఏనుగు సహా 14 ఏనుగుల మంద దాటి గ్రామంలోకి ప్రవేశించింది. దీంతో, వాహనచోదకులు, ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న అటవీ సిబ్బంది ఏనుగుల మందను సమీపంలోని అడవుల్లోకి తోలారు.

ముత్తుమారి అమ్మవారికి కరెన్సీతో అలంకారం



పెరంబూర్, ఏప్రిల్ 14: కోయంబత్తూర్ జిలా కాట్టూరు గ్రామ ప్రజలు తమిళ సంవత్సరాదిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలోని అంటైక్ ముత్తుమారి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు సమర్పించిన రూ.100, రూ.200, రూ.500 నోట్లతో అలంకరించారు.

కోలాహలంగా తమల పాకుల వేడుకలు



భక్తులకు తమలపాకులు అందజేస్తున్న గ్రామ పెద్దలు

పెరంబూర్, ఏప్రిల్ 14: తమిళ సంవత్సరాదిని మదురై జిల్లా వెల్లూరులో ప్రజలు సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. మంద్దై కరుప్పన్న స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో భాగంగా గ్రామ పెద్దలు. కట్టగా కట్టిన తమలపాకులను విడదీసి కొన్నింటిని భక్తులకు అందజేశారు. ఈ తమలపాకులను ఇంట్లో ఉంచి పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభిస్తే దిగుబడులు పెరుగుతాయని భక్తుల నమ్మకం.


కాశిమేడులో కొనుగోలుదారుల రద్దీ



పెరంబూర్, ఏప్రిల్ 14: చేపల వేట నిషేధకాలం సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, కాశిమేడు చేపల మార్కెట్ ఆదివారం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. రాష్ట్ర సముద్రతీర ప్రాంతాల్లో చేపల సంతానోత్పత్తి కారణంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేది వరకు చేపల వేటపై నిషేధం విధిస్తుంటారు. నిషేధకాలంలో నాటు పడవల్లో మాత్రమే జాలర్లు సముద్రంలో కొద్దిదూరం మాత్రమే వెళ్లి చేపలు పడుతుంటారు. ఆ కారణంగా చేపలు తక్కువగా లభ్యమై వాటి ధరలు పెరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో, పదిరోజుల క్రితం మర బోటుల్లో చేపల వేటకు వెళ్లిన చివరి బృందం శనివారం తీరానికి తిరిగొచ్చింది. దీంతో, ఆదివారం చేపల కొనుగోలుకు ప్రజలు, వ్యాపారులు కాశిమేడు మార్కెట్‌కు తరలివచ్చారు. దీంతో వంజరం చేపలు కిలో రూ.1,500, వవ్వాల్ రూ.900, శంకర రూ.600, తేంగాయ్ పారై రూ.850, రొయ్యలు రూ.500లకు విక్రయమయ్యాయి.

ఆ ఎన్నికల్లో మా ఓటమికి బీజేపీ కారణం...!

● అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్



పెరంబూర్, ఏప్రిల్ 14: '25 ఏళ్లగా రాయపురంలో కిరీటం లేని మహారాజులా ఉన్నాను. అపజయం అంటే తెలియనివాడిని, అలాంటి నేను ఎవరి వల్ల ఓడిపోయానంటే, బీజేపీ వల్లే" అంటూ అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ పేర్కొన్నారు. నగరంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... బీజేపీ కూటమిలో ఉన్నందువల్ల రాయపురంలోని 40,000 ఓట్లు తనకు పోలుకాలేదన్నారు. వారికి నేనంటే ఎలాంటి కోపం లేదని, ఎన్నికల్లో పోటీచేస్తున్న సమయంలో బీజేపీ వదిలి రావాలని వారు సూచించారని, సమయం వచ్చినప్పుడు తాము తప్పక వైదొలుగుతానని వారిని సముదాయించానని తెలిపారు. బీజేపీ కూటమిలో లేకుండా ఉంటే, 40 వేల ఓట్ల మెజార్టీతో తాను విజయం సాధించేవాడినన్నారు. అలాగే, రాష్ట్రంలో 2019, 2021 ఎన్నికల్లోనూ పార్టీ పరాజయం కావడానికి బీజేపీ కారణమని జయకుమార్ తెలిపారు.



నృత్యకళాకారిణులతో గవర్నర్ ఆర్‌ఎన్ రవి, సతీమణి లక్ష్మీరవి

మనుషులంతా ఒక్కటే..

అదే సనాతన ధర్మం

●గవర్నర్ ఆర్‌ఎన్ రవి ప్రకటన



మైలాపూరులోని తిరువళ్లువర్ ఆలయాన్ని సతీసమేతంగా సందర్శించుకున్న గవర్నర్

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం మానవుల మధ్య తారతమ్యాలను ఎక్కడా ప్రస్తావించలేదని, మనుషులంతా ఒక్కటే అని మాత్రమే బోధిస్తోందని గవర్నర్ ఆర్‌ఎన్ రవి అన్నారు. అడయార్‌లోని కాంచీపురం మహా స్వామి ఆనంద మండపంలో జరిగిన శృంగేరి శారదాపీఠం మఠాధిపతి భారతి తీర్థ స్వామి స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని శంకర విజయం పేరుతో ఏర్పాటైన సాంస్కృతిక, నృత్య ప్రదర్శన కార్యక్రమాల్లో ఆయన సతీసమేతంగా పాల్గొన్నారు. భారతం రుషులు, మునుల ద్వారా రూపొందించబడిందని, అందరూ ఏకైక కుటుంబానికి చెందినవారని హిందూ వేదాలు బోధిస్తున్నాయన్నారు. ఆంగ్లేయుల పాలన వల్లే భారత సంస్కృతిలో మార్పులు జరిగాయని చెప్పారు. సనాతన ధర్మం కూలితే భారతం కూడా పతనమవుతుందని అరవిందులు పేర్కొన్నారని తెలిపారు. సనాతన ధర్మం ఎల్లప్పుడూ వసుదైక కుటుంబాన్ని నొక్కివక్కాణిస్తుందన్నారు. . భారతదేశాన్ని సంపన్నదేశంగా మార్చేందుకు ప్రతిభారతీయుడు తన వంతు కృషిని అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

రత్నగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యస్వామి

వేలూరు, ఏప్రిల్ 14: తమిళ సంవత్సరాది సందర్భంగా ఆదివారం రత్నగిరి బాలమురుగన్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మొదట వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహా దీపారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

రూ.4 కోట్లు స్వాధీనం వ్యవహారం

బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు సమన్

పెరంబూర్, ఏప్రిల్ 14: తాంబరం రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న రూ.4 కోట్ల వ్యవహారంలో పోలీసులు విచారణ తీవ్రతరం చేశారు. ఎగ్మూర్ నుంచి ఈ నెల 6వ తేది తిరునల్వేలికి బయల్దేరిన ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తున్న రూ.4 కోట్ల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్ట్ చేసి విచారించగా తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ కోసం నగదు తీసుకెళ్తున్నట్లు వాంగ్మూలమిచ్చారు. అలాగే, తనిఖీల్లో లభించిన ఆధారాల మేరకు బీజేపీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌కు చెందిన హోటల్‌లో అధికారులు తనిఖీలు చేపట్టి రూ.1.10 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో, రైల్లో స్వాధీనం చేసుకున్న నగదుకు, అతనికి సంబంధం ఉందా అని విచారించేందుకు గోవర్ధన్‌కు తాంబరం పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈ క్రమంలో, రూ.4 కోట్లు స్వాధీనం చేసుకున్న వ్యవహారానికి సంబంధించిన నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని కోరుతూ తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు తాంబరం పోలీసులు సమన్లు జారీచేశారు. కాగా, పట్టుబడిన నగదుకు తనకు ఎలాంటి సంబంధం లేదని నయినార్ నాగేంద్రన్ ప్రకటించడం గమనార్హం.

రాజ్యాంగ నిర్మాతకు నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ సుబ్బలక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో మాలతి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తి, జిల్లా ఆదిద్రావిడ, బీసీ సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఏసీ షణ్ముగం

స్థానిక మసీదు ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహానికి వేలూరు లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కూటమి పార్టీల నేతలు అప్పుపాల్ బాలాజీ, జగన్, బాబు, ఓంప్రకాశ్, నవీన్, మనోహరన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

● చెన్నై కస్టమ్స్ చీఫ్ కమిషనర్ డా.రామ్‌నివాస్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐఆర్‌ఎస్ అధికారులు రామ్‌నివాస్, కేఎస్ వీవీ ప్రసాద్, రాజేష్ ధాబ్రే తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 14: అంబేడ్కర్ అడుగు జాడల్లో అందరూ నడవాలని చెన్నై కస్టమ్స్ చీఫ్ కమిషనర్ డా.రామ్‌నివాస్ సూచించారు. భారతరత్న అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని హార్బర్ సమీపంలోని కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ... అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. అనంతరం కస్టమ్స్ ఇంపోర్ట్ శాఖ కమిషనర్ కేఎస్‌వీవీ ప్రసాద్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి అంబేడ్కర్ దేశం గర్వించదగ్గ స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. కస్టమ్స్ అప్పిలేట్ కమిషనర్ రాజేష్ పటీసింగ్ ధాబ్రే మాట్లాడుతూ... భారత దేశం ఉన్నంత కాలం అంబేడ్కర్ పేరు చిరస్థాయిగా ఉంటుందన్నారు. చివరగా ఐటీ శాఖ జీఎస్‌టీ అధికారి గోపాలకృష్ణన్ మాట్లాడుతూ... ప్రపంచ మేధావి డా.అంబేడ్కర్ అణగారిన వర్గాల తలరాతలు మార్చి సమసమాజ స్థాపన విధాత అని కీర్తించారు. కార్యక్రమంలో భాగంగా ఐఆర్‌ఎస్ అధికారులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను అసోషియేషన్ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమ ఏర్పాట్లను అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కలైకుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణన్, ఉపాధ్యక్షులు పి.ఆదిలక్ష్మన్, టి.బాబు, ఉప కార్యదర్శులు బి.మునుస్వామి, ఎన్.మాలతి, జె.రాజన్, కోశాధికారి, కార్తికేయన్, వి.శ్రీనివాసన్, బి.రతీష్‌బాబులు పర్యవేక్షించారు.



పీఎంకే అభ్యర్థి సౌమ్య అన్బుమణితో కలిసి టీ తాగుతున్న టీఎంకే నేత జీకే వాసన్

గంజాయి అమ్మకంలోనే డీఎంకే ఫస్ట్!

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో అమలుకు వీలుకాని హామీలిచ్చి ప్రజలను మోసగించడమే డీఎంకే ఆనవాయితీగా పెట్టుకుందని, ప్రస్తుతం రాష్ట్రం మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌లో, గంజాయి అమ్మకంలో ముందంజలో ఉందని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ ఆరోపించారు. ధర్మపురిలో పీఎంకే అభ్యర్థి సౌమ్యకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఆ సందర్భంగా రోడ్డుపక్కనున్న టీషాపు వద్ద ఇరువురూ పార్టీప్రముఖులతో కలిసి టీ తాగారు. కేంద్రంలో మూడోసారి భారీ మెజారిటీతో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ముచ్చటగా మూడోసారి మోదీ ప్రధాని అవుతారని, ఈ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని ధైర్యంగా ఎదుర్కొన్న స్వాతంత్ర్య సమరయోధులు, చక్రవర్తులు మరుదపాండ్య సోదరులు, వీరవనితలు రాణి మంగమ్మ, వేలు నాచ్చియార్, కుయిలీ జన్మించిన శివగంగ జిల్లాకు ఘనచరిత్ర ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజకీయాల్లో ఈ జిల్లా చక్రం తిప్పుతోంది. ఆధ్యాత్మిక ప్రాంతాలు, చర్చిలు, మసీదులు, రాజుల కాలం నాటి భవనాలు, రుచికరమైన వంటకాలు అందించే కారైక్కుడి హోటళ్లకు శివగంగ జిల్లా ప్రసిద్ధి. - ప్యారీస్

శివగంగలో చక్రం తిప్పేదెవరు....?

ఓటర్లు...


గత జనవరి 25వ తేది రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం, శివగంగ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 16,30,841 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుషులు 8,00,786 మంది, మహిళలు 8,29,991 మంది, ఇతరులు 841 మంది ఉన్నారు.




కార్తీ చిదంబరం (కాంగ్రెస్)



జేవియర్ దాస్ (అన్నాడీఎంకే)



దేవనాథన్ యాదవ్ (బీజేపీ)



2019 ఫలితాలు...

శివగంగ నియోజకవర్గంలో 2019వ సంవత్సరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీచేసిన కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం 3,32,244 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో పోటీపడిన బీజేపీ అభ్యర్థి హెచ్.రాజా 2,38,860 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలువగా, ఏఎంఎంకే అభ్యర్థి తేర్‌బోగి 1,22,534 ఓట్లు పొందారు.

శాసనసభ స్థానాలు...

పుదుకోట జిల్లాలోని తిరుమయం, ఆళంగుడి అనే రెండు అసెంబ్లీ స్థానాలు, శివగంగ జిల్లాలోని కారైక్కుడి, తిరుపత్తూర్, శివగంగ, మానామధురై (రి) అనే 4 నియోజకవర్గాలతో శివగంగ పార్లమెంటు నియోజకవర్గం ఆవిర్భవించింది.

ప్రధాన వృత్తులు...

కారైక్కుడి కండంగి పట్టుకు భౌగోళిక గుర్తింపు రావడంతో పట్టువస్త్రాల ఉత్పత్తి బాగా పెరిగింది. ఆ స్థాయిలోనే వ్యవసాయం కూడా ప్రధాన వృత్తిగా కొనసాగుతోంది. వైగై నది పరివాహక ప్రాంతాల్లో లక్షలాది కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయి. జల్లికట్టు సాహస క్రీడా పోటీలు, పురాతన పరిశోధన మట్టి తవ్వకాలు, రెక్లా, ఎడ్ల పందులు, జానపద కళలకు కేంద్రంగా శివగంగ రాణిస్తోంది.

1967 నుంచి గెలిచిన వారి వివరాలు...

శివగంగ పార్లమెంటు నియోజకవర్గం 1967లో ఆవిర్భవించింది. ఆ సంవత్సరం ఎన్నికల్లో డీఎంకే తరఫున పోటీచేసిన టి.కృష్ణన్ 2,25,106 ఓట్లతో గెలిచారు. 1971వ సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఆయనే పోటీచేసి ఎంపీగా గెలిచారు. 1977లో అన్నాడీఎంకే అభ్యర్థి పెరియస్వామి త్యాగరాజన్, 1980లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్వీ స్వామినాథన్, 1984 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పి.చిదంబరం గెలిచారు. ఇందులో పి.చిదంబరం 1989, 1991 కాంగ్రెస్ తరఫున, 1996,1998లో తమిళ మానిల కాంగ్రెస్ తరఫున పోటీచేసి విజయం సాధించారు. ఆ తర్వాత 1999లో పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన నాచ్చియప్పన్ తొలిసారి ఎంపీగా నెగ్గి పార్లమెంటులో అడుగుపెట్టారు. 2004, 2009 ఎన్నికల్లో పి.చిదంబరం మళ్లీ కాంగ్రెస్ తరఫున పోటీచేసి గెలుపొందారు. 2014లో అన్నాడీఎంకే అభ్యర్థి సెందిల్‌నాథన్ ఎంపీగా గెలవగా, 2019 ఎన్నికల్లో కార్తీ చిదంబరం కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు.

సమస్యలు...

ఒకప్పుడు సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్న శివగంగ పార్లమెంటు నియోజకవర్గంలో పంటలు బాగా పండాయి. ఇప్పుడా పరిస్థితి మారడంతో అనేక ప్రాంతాల్లో బీడు భూములు దర్శనమిస్తున్నాయి. వైగై, పెరియార్ నదీ జలాలు సీజన్లో అందుబాటులో లేవని అన్నదాతలు ఏకరువు పెడుతున్నారు. ఇక భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడంతో బావుల్లో నీటి నిల్వలు తగ్గిపోయి తాగునీటికి కొరత ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో భారీ పరిశ్రమలు లేనందువల్ల ఇక్కడ పుట్టి బాగా చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలు వెతుక్కుంటూ చెన్నై సహా పలు రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రానైట్ వంటి ఖనిజ సంపద అధికంగా లభ్యమవుతున్నందువల్ల దానికి సంబంధించిన పరిశ్రమలు నెలకొల్పాలని స్థానికుల దీర్ఘకాల కోరిక. కాలియర్‌కోవిల్ లోని అతిపెద్ద రైస్ మిల్లు మళ్లీ ప్రారంభించాలి, రామేశ్వరం నుంచి శివగంగ మీదుగా నడిచే అన్ని రైళ్లు శివగంగలో ఆగి వెళ్లేలా చర్యలు చేపట్టాలి, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుచేయాలి, తొండి హార్బర్‌ను అందుబాటులోకి తీసుకొని రావాలి, విద్యుదుత్పత్తి కేంద్రాన్ని విస్తరింపజేయాలి, ఆరు అసెంబ్లీ స్థానాల్లో పరిశ్రమలు ప్రారంభించాలని శివగంగ ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు.

చక్రం తిప్పేదెవరో...?

ఈ స్థానంలో ఆదిద్రావిడులు, ముక్కులత్తోర్, యాదవులు, నగరత్తార్లు, వలంబర్లు, ముత్తరాసులు, నాడార్లు, క్రైస్తవులు, ముస్లింలు 90 శాతానికి పైగా ఉన్నారు. ఇప్పటివరకు 14 లోక్‌సభ ఎన్నికలు నిర్వహించగా, ఇందులో కాంగ్రెస్ 8 సార్లు, టీఎంసీ 2 సార్లు, డీఎంకే 2 సార్లు, అన్నాడీఎంకే 2 సార్లు గెలిచాయి. కాంగ్రెస్, టీఎంసీ తరఫున పోటీచేసిన పి.చిదంబరం 7 సార్లు ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా వ్యవహరించారు. సిట్టింగ్ ఎంపీ కార్తీ చిదంబరం రెండోసారి కాంగ్రెస్ తరఫున పోటీలో ఉన్నారు. అన్నాడీఎంకే తరఫున జేవీయర్ దాసు, బీజేపీ కూటమి తరఫున ఇండియా మక్కల్ కల్వి మున్నేట్ర కళగం అధ్యక్షుడు, తమిళనాడు యాదవులు సంఘం కార్యదర్శి దేవనాథన్ యాదవ్‌లు పోటీచేస్తున్నారు. వీరిలో చక్రం తిప్పేదెవరో ఎన్నికల ఫలితాల్లో తెలుస్తుంది.

సెంట్రల్ చెన్నైలో స్మార్ట్‌సిటీ పథకం అమలు

● బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం హామీ



చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ చెన్నైలో స్మార్ట్‌సిటీ పథకం అమలుకు చర్యలు చేపడతానని, నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని బీజేపీ అభ్యర్థి వినోజ్ పి. సెల్వం హామీ ఇచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా హార్బర్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత పర్యటనకు వెళ్తూ ఆయన ప్రసంగించారు. దశాబ్దాల తరబడి పేదలను కటిక దారిద్ర్యంలో ఉంచడమే డీఎంకే ఆశయమని, ఓటుకు నోటిచ్చి అభ్యర్థులను గెలిపించుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీలో పదవుల కోసం ఆరాటపడేవాళ్లు లేరని, ప్రజలకు సేవలు చేయడానికే పార్టీ నిర్వాహకులు పోటీపడతారన్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకేని ఓడిస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమించగలదని ఆయన తెలిపారు. ప్రచారరలో ప్రజల నుంచి లభిస్తున్న ఆదరాభిమానాల వల్ల తాను అత్యధిక మెజారిటీతో గెలవటం ఖాయమన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలోనే కాకుండా దక్షిణాది జిల్లాల్లోనూ బీజేపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని, ముచ్చటగా మూడోసారి మోదీ ప్రధాని అవుతారని వినోజ్ పి. సెల్వం ధీమా వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వినోజ్ పి. సెల్వం

మోదీ సంతకంతో తమిళ ఉగాది గ్రీటింగ్స్!



బీజేపీ ముద్రించిన ఉగాది గ్రీటింగ్ కార్డు

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ సంతకంతో ఉన్న తమిళ ఉగాది గ్రీటింగ్ కార్డులను పంపిణీ చేయడానికి ఆ పార్టీ ప్రముఖులు సిద్ధమవుతున్నారు. సుమారు 30వేల గ్రీటింగ్ కార్డులు ముద్రించి వాటిని ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేయనున్నారు. ఆ గ్రీటింగ్ కార్డులలో అందరి జీవితాల్లో కొత్త మార్పులు రావాలని, కొత్త వెలుగులు ప్రసరించి సుఖసంతోషాలు వెల్లివిరియాల ఆకాంక్షిస్తున్నాను' అంటూ ముద్రించారు.. చివర హిందీలో ప్రధాని మోదీ సంతకం కూడా ఉంది. ప్రతి జిల్లాలోనూ ఆదివారం ఉదయం నుండే ఈ గ్రీటింగ్ కార్డులను బీజేపీ స్థానిక నాయకులు పంపిణీ చేశారు.

రాష్ట్రానికి అదనపు పారా మిలిటరీ బలగాలు

● ఈసీ సత్యప్రదసాహు

పెరంబూర్, ఏప్రిల్ 14: ఎన్నికల భద్రతకు అదనంగా 10 కంపెనీల పారా మిలిటరీ బలగాలు కావాలని డీజీపీ కోరారని, ఈ విషయమై కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర ఎన్నిల ప్రధాన అధికారి సత్యప్రదసాహు తెలిపారు. నగరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి చెందిన 70 మంది సైనికులు తపాలా ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. జూన్ 4వ తేది ఉదయం 8 గంటల్లోపు తపాలా ఓట్లు పంపించాలన్నారు. బూత్ స్లిప్పులు వినియోగం వంద శాతం పూర్తయిందని తెలిపారు. 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు వినియోగించుకుంటున్న తపాలా ఓటు ఈ నెల 17వ తేదిలోపు ముగించనున్నట్లు ఆయన తెలిపారు.



పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నమశ్శివాయంకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హాస్య నటుడు సెంథిల్



సెంట్రల్ చెన్నై నియోజకవర్గంలో పోలీసుల కోసం ఏర్పాటు చేసే పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి డాక్టర్ జె రాధాకృష్ణన్



విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రాధిక ఎన్నికల ప్రచారంలో భాగంగా చేనేత కార్మికుడి ఇంట్లో బట్టలు నేస్తున్న దృశ్యం



పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థి తమిళ్ వేందన్ ఫొటోతో కూడిన ఫేస్ మాస్క్‌లు వేసుకున్న కార్యకర్తలతో ప్రచారం చేస్తున్న ఆయన భార్య నివేదిత

చిత్రజ్యోతి

'తిరుక్కురల్' షూటింగ్ ప్రారంభం

రమణ కమ్యూనికేషన్స్ అనే నిర్మాణ సంస్థ గతంలో కర్మవీరర్ 'కామరాజ్' పేరుతో మాజీ ముఖ్యమంత్రి దివంగత కామరాజర్ జీవిత చరిత్ర తెరకెక్కించింది. ఆ సినిమా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక అవార్డును సొంతం చేసుకుంది. అలాగే, మహాత్మా గాంధీ పేరుతో 'వెల్‌కమ్ బ్యాక్ గాంధీ' పేరుతో మరో చిత్రాన్ని నిర్మించగా, ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఇపుడు వీఐటీ చాన్సలర్ డాక్టర్ కె.విశ్వనాథన్, తమిళియ్యక్కం టీపీ రాజేంద్రన్ సంయుక్తంగా 'తిరుక్కురళ్' ఆధారంగా ఓ సినిమాకు శ్రీకారం చుట్టారు. ఆ చిత్రం ప్రారంభోత్సవ పూజాకార్యక్రమం ఆదివారం నగరంలో అట్టహాసంగా ప్రారంభమైంది. తమిళ ఉగాది పురస్కరించుకుని షూటింగ్ ప్రారంభించారు. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన తొలి షాట్‌కు కె.విశ్వనాథన్ కెమెరా స్విచాన్ చేశారు. ప్రపంచంలో బైబిల్ తర్వాత అత్యధికంగా అనువదించబడిన పుస్తకం తిరుక్కురల్‌గా రికార్డు ఉంది. మూడు గంటల్లో రూపొందించే ఈ దృశ్యకావ్యంలో తిరుక్కురల్‌లోని అంతర్లీన భావాన్ని, దానిలోని జీవశక్తిని పొందుపరచడం అంత సులభం కాదని దర్శకుడు ఏజే బాలకృష్ణన్ తెలిపారు. వళ్ళువర్‌గా కలైచోళన్, వాసుకిగా ధనలక్ష్మి, నక్కీరన్‌గా సుబ్రమణ్య శివ, పాండ్య రాజుగా ఓఏకే సుందర్ నటిస్తుంటే ఈ చిత్రానికి కెమెరా ఎడ్విన్ సహాయ్, ఆర్ట్స్ సురేష్ కలేరి, స్క్రీన్‌ప్లే, మాటలు సెంబూరు కే.జయరాజ్.



'ఐకానిక్'గా నడిగర్ సంఘం భవనం : విశాల్



టీఎంజేఏ ఉగాది వేడుకల్లో విశాల్, కవిత, ఒట్రాన్ దురై తదితరులు

నడిగర్ సంఘం కోసం టి.నగర్ హబీబుల్లా రోడ్డులో నిర్మించే భవనం నగరంలోనే ఒక ఐకానిక్ భవనంగా ఉంటుందని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, సినీ హీరో విశాల్ తెలిపారు. తమిళ సినిమా జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో తమిళ కొత్త సంవత్సరాది ఉగాది వేడుకలు జరిగాయి. ఇందులో హీరో విశాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నడిగర్ సంఘం భవన నిర్మాణం ఈ యేడాది ఆఖరు నాటికి పూర్తి కావొచ్చన్నారు. ఆయా భాషల చిత్రపరిశ్రమలకు హైదరాబాద్, ముంబై నగరాల్లో మంచి ఆడిటోరియాలున్నాయి. ఆ తరహా సౌకర్యాలు మనకు లేవు. అందుకే నడిగర్ సంఘం భవాన్ని నగరంలోనే ఒక ఐకానిక్‌గా నిర్మించాలన్న తపన మా కార్యవర్గ సభ్యులందరిలో ఉంది. అందుకు అనుగుణంగానే ముందుకు సాగుతున్నాం. ఈ భవనంలో పెద్ద ఆడిటోరియం, సినిమా ఈవెంట్స్ జరుపుకునేందుకు వీలుగా థియేటర్, నడిగర్ సంఘం సభ్యులు తమ పిల్లలకు ఉచితంగా వివాహం చేసుకునేందుకు వీలుగా ఒక కల్యాణ మండపం, థియేటర్ ఆర్టిస్టులు, స్టేజ్ కళాకారులు నాటకాలు ప్రదర్శించుకునేందుకు అనువుగా మరో థియేటర్, మాట్లాడుకునేందుకు ఒక సెంటర్, దాదాపు వంద నుంచి 130 కార్లు పార్కింగ్ చేసుకునేలా విశాలమైన పార్కింగ్ స్థలం ఇలా అనేక అత్యాధునిక సదుపాయాలతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నాం. ముఖ్యంగా థియేటర్ ఆర్టిస్టులను ప్రోత్సహించేలా నడిగర్ సంఘం చర్యలుంటాయి. ఈ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత నా పెళ్ళి గురించి ఆలోచన చేస్తాను. 'చెల్లమే' అనే సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుపెట్టిన నేను రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్నానని, దీనికి కారణం... ఓపిక ముఖ్య కారణం. వర్ధమాన, ఔత్సాహిక నటీనటులు సినిమా అవకాశాల కోసం ఓపికతో వేచిచూడాలి' అని కోరారు. కార్యక్రమంలో టీఎంజేఏ అధ్యక్షుడు కవిత, కోశాధికారి ఒట్రాన్ దురై, టీఎంజేఏ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భారతీ మోహన్ దర్శకత్వంలో 'సన్నాఫ్ కళింగరాయన్'



'సన్నాఫ్ కళింగరాయన్' ఓ దృశ్యం

భారతీ మోహన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సన్నాఫ్ కళింగరాయన్'. సన్‌షైన్ స్టూడియోస్ బ్యానరుపై సతీష్ ఖన్నా నటించారు. ఉదయకృష్ణ ప్రధాన పాత్రలలో నటిస్తుండగా, తెండ్రల్, ఖుషి శైలజ తదితరులు నటించారు. సీనియర్ నటుడు ఆనందబాబు క్యారెక్టర్ రోల్ పోషించారు. దర్శకుడు భారతీ మోహన్ పోలీస్ ఉన్నతాధికారి పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు వివరిస్తూ, '2010 నుంచి 2024 వరకు పశ్చిమ కనుమల్లోని గిరిజన సాగు భూములు అనే విషయాన్ని దాచిపెట్టి అటవీ ప్రాంతం పేరుతో అడవుల పెంపకం పేరుతో బడా వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. ఇలా వేలాది ఎకరాల గిరిజన భూముల ను ఆధ్యాత్మికవేత్తలకు అప్పగించారు. ఆదివాసీ భూములను బలవంతంగా తమవశం చేసుకుని, గిరిజన మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఆధిపత్యశక్తులకు వ్యతిరేకంగా నిలబడే పోలీస్ అధికారి కథ అని దర్శకుడు వివరించారు. ఈ చిత్రాలకు కెమెరా చంద్రన్ స్వామి, ఎడిటింగ్ శరణ్ షణ్ముగం, స్టంట్స్ సరవెడి శరవణన్, డ్యాన్స్ రమేష్ కమల్, దర్శకత్వం భారతీ మోహన్.

మంత్రి ఉదయనిధి హెలికాప్టర్ తనిఖీ

పెరంబూర్, ఏప్రిల్ 14: నీలగిరి జిల్లాలో ఎన్నికల ప్రచారం కోసం వెళ్లిన మంత్రి ఉదయనిధి హెలికాప్టర్‌ను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. నీలగిరి నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి ఎ.రాజాకు మద్దతుగా సోమవారం కూడలూరు, కున్నూర్, ఊటీ, కోతగిరి తదితర ప్రాంతాల్లో మంత్రి ఉదయనిధి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. అందుకోసం మంత్రి ఆదివారం సాయంత్రం హెలికాప్టర్‌లో నీట్టుక్కల్ ప్రాంతంలో ల్యాండ్ అయ్యారు. అప్పటికే అక్కడ ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు హెలికాప్టర్ వద్దకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. అందులో నగదు, బహుమతులు, ఇతర అనుమానించే వస్తువులు లేవని గుర్తించిన అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మా పార్టీ జోలికి వస్తే నాశనమే!

● ఎడప్పాడి హెచ్చరిక



ఆత్తూరు సభలో ఎడప్పాడిని గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేని నాశనం చేయాలని ప్రయత్నించినవారంతా చరిత్రలో మట్టికొట్టుకుపోయారని, తమ పార్టీ జోలి కి వస్తే నాశనమవుతారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) హెచ్చరించారు.అన్నాడీఎంకేని నాశనం చేసే మగధీరులు ఇంకా ఈ భూమిలో పుట్టలేదన్నారు.సేలం జిల్లా ఆత్తూరులో ఆదివారం సాయంత్రం కళ్లకురిచ్చి అన్నాడీఎంకే అభ్యర్థి కుమరగురుకు మద్దతుగా ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డీఎంకే చెప్పిన మాయమాటలకు, హామీలకు మోసపోయామని బాధపడుతున్న రాష్ట్ర ప్రజలంతా అన్నాడీఎంకేని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ గెలిస్తే మదురై ఎయిమ్స్ త్వరితగతిన నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఈవీఎంలతో మోసాలకు పాల్పడేందుకు మోదీ కుట్ర

● సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి



మదురైలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

అడయార్, ఏప్రిల్ 14: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందువల్ల ఆయన ఈవీఎంల ద్వారా మోసాలకు పాల్పడి మరోమారు అధికారంలోకి రావాలని చూస్తున్నారని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. మదురై లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి వెంకటేశన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఈవీఎంల ద్వారా అక్రమాలకు పాల్పడి గెలుపొందాలని చూస్తున్నారని ఆరోపించారు. అదేసమయంలో మోదీని విమర్శించే విపక్ష నేతలను ఎలాంటి విచారణ లేకుండా అరెస్టు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలతో అనేక సంస్థలను బెదిరించి వేల కోట్ల రూపాయల నిధులు పొంది ఎలక్టోరల్ బాండ్ల ద్వారా భారీ అవినీతికి పాల్పడ్డారని సీతారాం ఏచూరీ ఆరోపించారు.

దిక్సూచి DIKSUCHI

భారతదేశ చరిత్రలో గుప్తుల కాలాన్ని పరిశీలించే క్రమంలో ఆనాటి సామాజిక, ఆర్థిక తదితర పరిణామాలను తరచి చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు వీటిని మరింత లోతుగా తెలుసుకోవాలి.

గుప్తుల కాలంలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు



ఇండియన్ హిస్టరీ

గుప్తుల కాలం నాటి సమాజంలో నాలుగు వర్ణాలతో పాటు 'చండాలులు' అనే పంచమ వర్ణం ఏర్పడింది. దీనిని ఫాహియాన్ 'అంటరాని వర్ణం'గా పేర్కొన్నాడు. వర్ణాశ్రమ ధర్మాలు ఉండేవి. అయినప్పటికీ 'వర్ణ సంకర' విధానం కొనసాగింది. వర్ణాశ్రమ ధర్మం కాపాడటానికి 'అభయదత్తుడు' అనే ఉద్యోగిని రాజు నియమించాడు. శాతవాహనుల మాదిరిగానే వీరు కూడా బ్రాహ్మణులకు అగ్రహారాలు(గ్రామాలు) దానంగా ఇచ్చేవారు.

గుప్తుల కాలంలో స్త్రీ స్వేచ్ఛ తగ్గిపోయింది. సతీసహగమనం, బాల్య వివాహాలు, బహుభార్యత్వం వంటి అనాచారాలు కొనసాగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహాలు ఉండేవి. పురుషులు అధిక వర్ణం స్త్రీలను వివాహాలు చేసుకోవడాన్ని ధర్మశాస్త్రాలు నిషేధించాయి. క్రీ.శ.510లో 'ఎరాన్' శాసనాన్ని భానుగుప్తుడు చెక్కించాడు. దీనిలో సతీసహగమనం, దేవదాసి ఆచారం ఉన్నట్లు రాసి ఉంది. సమాజంలో శెట్టిలు(వ్యాపారులు), జితిక అనే వృత్తిపనివారు ఉన్నారని 'భితారి' శాసనంలో రాశారు. సేద్య బానిసలు, జాజ్‌మని అనే వ్యవస్థకు గుప్తుల కాలంలోనే పునాది పడింది. ఈ వ్యవస్థకు గల కారణాలు 'ఇండోర్' శాసనంలో ఉన్నాయి.

నలంద విశ్వవిద్యాలయం

దీనిని కుమారగుప్తుడు నిర్మించాడు. తరవాత పుష్యభూపతి వంశంలో హర్షుడు ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ఆ తరవాత పాలరాజులకు చెందిన ధర్మపాలుడు కూడా ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశాడు. సంస్కృతంలో 'నలం' అంటే జ్ఞానం లేదా పద్మం అని, 'ద' అంటే ఇవ్వడం అని అర్థం. నలంద విశ్వవిద్యాలయంలో మూడు గొప్ప గ్రంథాలయాలు ఉన్నాయి. వీటికి తురుష్కరాజులు సహాయం చేశారు. 12వ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ చేతిలో ఈ విశ్వవిద్యాలయం పతనం చెందింది.



ఆర్థిక విధానం

భూములను సామంతులకు, ఉద్యోగులకు, బ్రాహ్మణులకు దానాలుగా ఇవ్వడం వల్ల రాజుకు భూమిపై అధికారం తగ్గింది. రాజుకు, సాగుచేసే సామాన్య రైతుకు మధ్య అనేక మంది మధ్యవర్తులు ఉండటంతో ఫలితాన్ని అనుభవించే భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. ఈ భూస్వామ్య వ్యవస్థ గురించి 'భితారి' శాసనంలో రాశారు. 'సార్థవాహనులు' అనే సంచార వర్తకులు కూడా నగరాల్లో ఎక్కువగా ఉండేవారు. రైతులపై హిరణ్య(నగదు పన్ను); కొనుగోలు మీద వేసే క్లిప్త, ఉపక్లిప్త పన్నులు; అమ్మకపు పన్ను; వ్యవసాయానికి వాడుకునే నీటిపై వేసే వత భూత పన్ను గుప్తుల కాలంలో విధించేవారు.

భూ విభజన: భూములను ఖిల్ల(వ్యవసాయ), క్షేత్ర(నివాస), స్థల(అటవీ) అని మూడు రకాలుగా విభజించారు.

నాణేలు: కంస, సిక్క

విదేశీ వాణిజ్యం: గుప్తులు ఎక్కువగా ఆగ్నేయాసియా దేశాలతో వర్తక వాణిజ్యాలు నిర్వహించేవారు. అరికమేడు, ముజ్రిస్, కావేరి రేవు పట్టణాలు ప్రసిద్ధి. పర్షియా, అరేబియా, ఆఫ్ఘానిస్థాన్ దేశాల నుంచి గుర్రాలను దిగుమతి చేసుకునే వారు.

మత విధానం

వైదిక మతం పునరుద్ధరించారు. క్రతువులు, యజ్ఞయాగాలు పెరిగాయి. వేదాలు వినడం, ఇతిహాసాలు చదవడానికి శూద్రులకు అవకాశం కల్పించారు. దశావతారాలు, త్రిమూర్తులను నాటి ప్రజలు పూజించేవారు. బౌద్ధ, జైన మత సూత్రాలను హిందూ మతం గ్రహించింది. శైవ మతానికి ఆదరణ పెరిగింది. మూఢ నమ్మకాలు కూడా పెరిగాయి. విగ్రహారాధన స్థిరపడింది.

వైష్ణవం: ఈ మతంలో నూతన శాఖలు ఏర్పడ్డాయి. పంచరాత్రి, వైఖానస మొదలైన శాఖలు ఏర్పడ్డాయి. రెండో చంద్రగుప్తుడు పరమ భాగవతుడని పేరు పొందాడు.

శైవం: శైవంలో తాంత్రిక శాఖలు, భక్తి శాఖలు ఏర్పడ్డాయి. వీటిని కాపాలిక, కాలాముఖ శాఖలు అనేవారు. మితవాద శాఖలు కూడా ఉండేవి. శివున్ని లింగ రూపంలో పూజించడం ప్రారంభించారు. ఇది మొదట కశ్మీర్‌లో ప్రారంభమైంది. అభినవ గుప్తుడు త్రిక అనే శాఖను ప్రారంభించాడు. వసుగుప్తుడు ప్రత్యాభిజ్ఞా అనే శైవ శాఖను ప్రారంభించాడు.

జైన మతం: అనేక జైన స్థావరాలు నిర్మించారు. గుజరాత్‌లో జైనమతం అభివృద్ధి చెందింది.

బౌద్ధ మతం: అనేక ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు నిర్మించారు. బుద్ధగయలో బౌద్ధ విహారం నిర్మించడానికి శ్రీలంక రాజు మేఘవర్ణుడికి సముద్రగుప్తుడు అనుమతించి పరమత సహనం చాటాడు. మథుర, సార్‌నాథ్, కోశాంబి మొదలైనవి బౌద్ధ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. అసంగుడు, పరమార్థుడు, దిగ్నాగుడు ఈ కాలపు గొప్ప బౌద్ధ పండితులు.

గుప్తుల పరమత సహనం: గుప్తులు హిందూ మతాభిమానులైనా...పరమత సహనం చూపారు. బౌద్ధ, జైనులకు పదవులు ఇచ్చారు. దానాలు చేశారు. విరాళాలు ఇచ్చారు. రెండో చంద్రగుప్తుని సేనాని 'అమరక దేవుడు' బౌద్ధుడు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

సాహిత్యం

గుప్తుల కాలం సాహిత్యానికి స్వర్ణయుగం అని చెప్పవచ్చు. సముద్రగుప్తుడు స్వయంగా కవి. అతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉండేది. రెండో చంద్రగుప్తుని కాలంలో 'నవరత్నాలు' అని పేరుపొందిన కవులు ఉండేవారు. వారిలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కాళిదాసు ఒకరు. ఈయన రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' గ్రంథాన్ని సర్ విలియం జోన్స్ ఆంగ్లంలోకి అనువదించాడు. 'మాళవికాగ్నిమిత్రం' నాటకంలో ఉజ్జయని రాకుమార్తె మాళవికను మగధ యువరాజు అగ్నిమిత్రుడు చేసుకున్న వివాహం(రాక్షస వివాహం) గురించి కాళిదాసు అద్భుతంగా రాశాడు.

గుప్తుల కాలంలో కొనసాగిన సాహిత్య సేవను చరిత్రకారులు గ్రీస్‌లోని పెరిప్లస్ యుగంతో, రోమ్‌లోని అగస్టస్ యుగంతో, ఇంగ్లాండ్‌లోని ఎలిజబెత్ యుగంతో పోల్చారు. గుప్త రాజులు సంస్కృత, సాహిత్య రంగాల్లో చేసిన సేవల వల్లనే వారి యుగానికి స్వర్ణయుగం అనే పేరు వచ్చింది. గుప్త చక్రవర్తులు స్వయంగా పండితులు. అలహాబాద్ ప్రశస్తి శాసనంలో కావ్యశైలిలో హరసేనుడు అద్భుతంగా రాశాడు.

నవరత్నాలలో ఒకడైన కాళిదాసు రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం అనే కావ్యాలు రాశాడు. అదేవిధంగా ఇతర కవుల గ్రంథాలు... శూద్రకుడు - మృచ్ఛకటికం; విశాఖదత్తుడు- ముద్రా రాక్షసం, దేవీచాంద్రగుప్తం; భానుడు- వాసవదత్త, విష్ణుశర్మ- పంచతంత్రం మొదలైనవి. అమరసింహుడు 'అమరకోశం' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. కామాంధకుడు 'నీతి శాస్త్రం' రచించాడు. ఇది గుప్తుల కాలంలో వచ్చిన రాజకీయ గ్రంథం. మౌర్యుల అర్థశాస్త్రంతో పోల్చదగినది.

వేదాంత శాస్త్రాలు: ఈ కాలంలో అద్భుతమైన గ్రంథాలు వచ్చాయి. అసంగుడు బౌద్ధ గ్రంథాలపై వ్యాఖ్యానాలు రాయగా, దిగ్నాగుడు ప్రమాణచముచ్చేయం రాసి తర్కశాస్త్ర పితగా ప్రసిద్ధి చెందాడు. అష్టాదశ పురాణాలను ఈ కాలంలోనే రాశారు. మనుధర్మశాస్త్రం, యజ్ఞవల్క్యస్మృతి మొదలైనవి ఈ కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

విజ్ఞానశాస్త్ర గ్రంథాలు: గుప్తుల కాలంలో సాహిత్యంతోపాటు విజ్ఞాన శాస్త్రం కూడా అభివృద్ధి చెందింది. గణిత, ఖగోళ, భౌతిక, వైద్యశాస్త్రాలు అభివృద్ధి చెందాయి. దశాంశ పద్ధతి, సున్నా విలువలు వాడుకలోకి వచ్చాయి. రెండో చంద్రగుప్తుడు ఉజ్జయినిలో నక్షత్రశాలను నెలకొల్పాడు. మెహరోలిలో నక్షత్రాల పరిశీలన కోసం వరహమిహిరుడికి రెండో చంద్రగుప్తుడు ఎత్తయిన ఇనుప స్తంభం నిర్మించి ఇచ్చాడు. రోమక, జాతక, లఘు అనే గణితశాస్త్ర గ్రంథాలను వరహమిహిరుడు రాశాడు. అదేవిధంగా బృహత్‌సంహిత గ్రంథంలో భూగోళ, ఖగోళ, జ్యోతిష, వృక్ష శాస్త్రాల గురించి రాశాడు. ఆర్యబట్టీయం, సూర సిద్ధాంతాలను ఆర్యబట్టు రచించాడు. వీటిలో సూర్య, చంద్ర గ్రహణాల గురించి వివరించాడు. వాగ్భటుడు వైద్యంలో అష్టాంగ సంగ్రహం అనే గ్రంథం రాశాడు. పాలకశ్యపుడు హస్త్యాయుర్వేదంలో పశువైద్యం గురించి రాశాడు. ధన్వంతరి, శుశ్రుతుడు గుప్తుల కాలంలో గొప్ప వైద్యులు.

డాక్టర్ ఐ. నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట.



కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్ | పోటీపరీక్షల ప్రత్యేకం

పార్ట్-3

1. ఒక కోడ్ భాషలో MERITను 7, 18, 9, 22, 14గా రాశారు. అదే కోడ్ భాషలో PONDSను ఏ విధంగా రాస్తారు?

ఎ) 11, 12, 23, 13, 8 బి) 11, 13, 12, 8, 23 సి) 8, 23, 13, 12, 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: MERIT అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా M అనగా 14వ అక్షరం, E అనగా 22, R అనగా 9, I అనగా 18, T అనగా 7. ఈ సంఖ్యలను రివర్స్ చేయగా 7, 18, 9, 22, 14. ఇదే విధంగా PONDS అనే పదాల్లోని అక్షరాలకు అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా P అనగా 11, O అనగా 12, N అనగా 13, D అనగా 23, S అనగా 8. కావున 8, 23, 13, 12, 11 అనగా 'సి' సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో LUNCHను 58గా రాశారు. అదే కోడ్ భాషలో FRUITను ఏ విధంగా రాస్తారు?

ఎ) 74 బి) 68 సి) 72 డి) ఏదీకాదు

సమాధానం:(ఎ)

వివరణ: LUNCH అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా L అనగా 12, U అనగా 21, N అనగా 14, C అనగా 3, H అనగా 8, 12+21+14+3+8=58. ఇదే విధంగా PONDS అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా F అనగా 6, R అనగా 18, U అనగా 21, I అనగా 9, T అనగా 20. కావున 6 +18+21 + 9 + 20=74 సమాధానం అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో BIGను 324గా రాశారు. అదే కోడ్ భాషలో ACTను ఏ విధంగా రాస్తారు?

ఎ) 576 బి) 529 సి) 676 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: BIG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 9, 7 వీటిని కూడగా 2+9+7=18. ఈ 18 వర్గం (స్క్వేర్) 324. అదే విధంగా ACT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 3, 20 వీటిని కూడగా 1+3+20=24. ఈ 24 వర్గమే (స్క్వేర్) 576.

4. ఒక కోడ్ భాషలో AIMను 251గా రాశారు. అదే కోడ్ భాషలో INKను ఏ విధంగా రాస్తారు?

ఎ) 416 బి) 398 సి) 264 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: AIM అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 9, 13. వీటి విడి విడి వర్గాలను కూడగా అనగా $1^2, 9^2, 13^2$ = 1+81+169=251 అదే విధంగా INK అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 9, 14, 11. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $9^2, 14^2, 11^2$= 81+196+121=398 సమాధానం అవుతుంది.

5. ఒక కోడ్ భాషలో HATను 160గా రాశారు. అదే కోడ్ భాషలో 'PAN'ను ఏ విధంగా రాస్తారు?

ఎ) 224 బి) 242 సి) 422 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: HAT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 8, 1, 20. వీటిని గుణించగా 8x1x20=160 అదే విధంగా PAN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 16, 1, 14 వీటిని గుణించగా 16x1x14 = 224 సమాధానం అవుతుంది.

6. ఒక కోడ్ భాషలో PLANEను 96గా రాశారు. అదే కోడ్ భాషలో SOLVEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 142 బి) 144 సి) 146 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: PLANE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు P అనగా 16, L అనగా 12, A అనగా 1, N అనగా 14 E అనగా 5 వీటిని కూడగా 16+12+1+14+5=48కి రెట్టింపు 96. అదే విధంగా SOLVE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు S అనగా 19, O అనగా 15, L అనగా 12, V అనగా 22, E అనగా 5 వీటిని కూడగా 19+15+12+22+5=73 కి రెట్టింపు 146 సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో SMART ను 128గా రాశారు. అదే కోడ్ భాషలో RANGEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 180 బి) 160 సి) 168 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: SMART అనే పదంలోని అక్షరాలకు అపసవ్య దిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా S అనగా 8, M అనగా 14, A అనగా 26, R అనగా 9, T అనగా 7. వీటిని కూడగా 8+14+26+9+7=64కి రెట్టింపు 128. ఇదేవిధంగా RANGE అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు R అనగా 9, A అనగా 26, N అనగా 13, G అనగా 20, E అనగా 22 వీటిని కూడగా 9+26+13+20+22=90 రెట్టింపు 180 సమాధానం అవుతుంది.

8. ఒక కోడ్ భాషలో LIKEను 33గా రాశారు. అదే కోడ్ భాషలో EARNను ఏ విధంగా రాస్తారు?

ఎ) 34 బి) 38 సి) 37 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LIKE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 12+9+11+5=37. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 37 నుంచి 4 తీసివేస్తే 37-4=33. అదే విధంగా EARN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 5+1+18+14=38. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 38 నుంచి 4 తీసివేస్తే 38-4=34 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

- 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం..
- ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్
- అన్నదాతలందరికీ డ్రోన్లు
- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం
- బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు



బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న మోదీ, నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. మళ్లీ అధికారంలో వస్తే ఐదేళ్లలో ఏం చేస్తామో చెబుతూ.. దేశ ప్రగతి, యువత, మహిళలు, పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ అగ్రనేతలు ఆవిష్కరించారు. మోదీకి గ్యారెంటీ శీర్షికతో ఉన్న ఈ మ్యానిఫెస్టోను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారం మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ దక్షిణాదికీ బుల్లెట్ రైలు సేవలను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర, తూర్పు భారత్‌కూ బుల్లెట్ రైలు వేస్తామన్నారు. దీనిపై త్వరలో సర్వే ప్రారంభం కానుందని పేర్కొన్నారు. శరవేగంగా సాగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులు పూర్తయ్యే దశకు వచ్చాయని.. ఈ అనుభవంతో మిగతా మూడు ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పారు. వందే భారత్ రైలు సేవలను దేశవ్యాప్తం చేస్తామన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని తెలిపారు. ముద్ర పథకం రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ నీరు, పైప్ ద్వారా గ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చారు. పీఎం సూర్య ఘర్ ద్వారా జీరో పవర్ బిల్‌ను సాకారం చేస్తామన్నారు. మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ అందిస్తామని మోదీ తెలిపారు. ఇప్పటికే 4కోట్ల ఇళ్లు కట్టించామని.. మధ్య తరగతికి మరో 3కోట్ల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

నాలుగు స్తంభాలతో సంకల్ప్ పత్ర

పేదలు, యువశక్తి, అన్నదాత, నారీశక్తి.. అనే నాలుగు స్తంభాలపై సంకల్ప్ పత్రకు పునాదులు వేశామని మోదీ వెల్లడించారు. పదేళ్లలో ఎంతో ప్రగతిని సాధించామని, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని అందుకే బీజేపీ మ్యానిఫెస్టో కోసం యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెంచుతామని మోదీ చెప్పారు. ప్రతి రైతు ఇంటిపై డ్రోన్లు తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారిన అవినీతిని అంతమొందించడానికి ఎంతో చేశామని, భవిష్యత్తులోనూ దీనిని కొనసాగిస్తామని చెప్పారు. 140 కోట్ల మంది ప్రజలను దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టోను తయారు చేసామని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. మోదీ గ్యారెంటీపత్రం 24 క్యారెట్ల బంగారంతో సమానమన్నారు. మోదీ గ్యారెంటీ, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాలుగా పేర్కొన్న బీజేపీ మ్యానిఫెస్టో తొలి కాపీలను ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన నలుగురికి అందజేశారు. విశ్వబంధు, స్వస్థ భారత్, సురక్షిత భారత్, సుస్థిర భారత్, సమృద్ధ భారత్, సాంకేతిక, ప్రపంచ తయారీ కేంద్రం, అత్యుత్తమ శిక్షణ, క్రీడా, సాంస్కృతిక వికాసం, ఈజ్ ఆఫ్ లివింగ్, సుపరిపాలన అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

మ్యానిఫెస్టోలోని కీలక అంశాలు

ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్; వందేభారత్ స్లీపర్, చైర్ కార్, మెట్రో రైల్ సర్వీసుల ప్రారంభం; జాతీయ విద్యా విధానం అమలు; 2036లో ఒలింపిక్స్ నిర్వహణ; పీఎం ఆవాస్ యోజనలో దివ్యాంగులకు ప్రాధాన్యం; యువతకు మౌలిక సదుపాయాల కల్పన; పర్యాటక రంగంలో లక్షల ఉద్యోగాల కల్పన; 3కోట్ల మంది మహిళలను లక్షాధికారుల చేసే లక్ష్యం; ఈశాన్యంలో సైన్యానికి ప్రత్యేకాధికారాల చట్టం క్రమంగా ఎత్తివేత; ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా గిగ్ వర్కర్లు, ట్యాక్సీ, ఆటో, ట్రక్కు డ్రైవర్లకు సంక్షేమ పథకాలు; తిరువళ్లూర్ కల్చరల్ సెంటర్ ద్వారా భారత సంస్కృతి ప్రపంచ దేశాలకు పరిచయం; ఉన్నత విద్యాసంస్థల్లో భారతీయ భాషల అధ్యయనానికి తోడ్పాటు; ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి ప్రయత్నం; ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా శాటిలైట్ పట్టణాలు; ఏకలవ్య పాఠశాలలు, పీఎం జన్‌మన్ పథకాలకు ప్రాధాన్యం; అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం.

నిరుద్యోగం కనపడలే.. ద్రవ్యోల్బణం వినపడలే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

దేశ ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అనే అంశాలు బీజేపీ మ్యానిఫెస్టోలో లేనే లేవని, మోదీ ప్రసంగంలోనూ వినపడలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ రెండు అంశాలపై చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని విమర్శించారు. యువత ఈసారి మోదీ వలలో పడదని, ఉపాధి విప్లవం రాబోతోందని వ్యాఖ్యానించారు. కాగా, మోదీ గ్యారెంటీ ఒక జుమ్లా అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు ఆదాయం రెట్టింపు చేశారా? అని నిలదీశారు. దక్షిణాదికీ బుల్లెట్ రైలు అంటున్నారని.. మొదటి బుల్లెట్ రైలే ఇంకా పట్టాలెక్కలేదని ఎద్దేవా చేశారు.

సెల్ టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్స్‌లో చైనా విప్లవాత్మక ఆవిష్కరణను తీసుకొచ్చింది. భూమిపై ఉన్న సెల్ టవర్ల అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్‌ను సాధ్యం చేయగలిగేలా ప్రపంచంలోనే మొదటి ఉపగ్రహాన్ని ఆ దేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వర్గంతో కనెక్ట్ అవ్వడం అని అర్థం వచ్చేలా దీనికి 'టియాంటాంగ్' అని దీనికి పేరుపెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం చైనా రోదసీలోకి పంపిన 'టియాంటాంగ్-1' ఉపగ్రహ శ్రేణి ప్రస్తుతం మూడుకు చేరింది. ఇవి జియోసింక్రోనస్ కక్ష్యలో తిరుగుతూ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని కవర్ చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీకి మార్గం సుగమమైంది. చైనాకు చెందిన 'హువావే' ఇప్పటికే ప్రపంచంలోనే శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేసే మొదటి మొబైల్ కంపెనీగా గుర్తింపు పొందింది. హువావే టెక్నాలజీస్ గతేడాది సెప్టెంబరులో శాటిలైట్ కాల్స్‌కు మద్దతునిచ్చే స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ జాబితాలో షియోమి, హానర్, ఒప్పో వంటి మొబైల్ కంపెనీలు కూడా చేరాయి. గతేడాది డిసెంబరు 18న చైనాలోని గాన్సు ప్రావిన్స్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. సాంప్రదాయ కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయలేదు. ఈ సమయంలో బాధితుల్లో కొందరు శాటిలైట్ కాల్ సౌకర్యం ద్వారా బాహ్య ప్రపంచంతో సమాచారాన్ని పంచుకోగలిగారు.